ప్రజాశక్తి
బుధవారం 26 ఫిబ్రవరి 2025
5
శ్రీకాకుళం

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ అన్నారు. స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత లక్ష్య సాధన వైపు అడుగులు వేయాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారి కెప్టెన్ వై.పోలినాయుడు, ఎన్ఎస్-ఎస్ పిఒ డాక్టర్ ఆర్.శ్రీనివాస పాత్రో, ఎం.వి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం పరిసమాప్తం

- పోటాపోటీగా సాగిన ప్రచారం
- ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్న అభ్యర్థులు
- ప్రచారంలో పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి ముందంజ
- ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ఈనెల 27వ తేదీన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఐదు గంటలతో ప్రచారం గడువు ముగిసింది. దీంతో అంతా ప్రచారానికి స్వస్తి చెప్పి కేడర్‌తో సమావేశాలకు తెర తీశారు. పోలింగ్ రోజు అనుసరించాల్సిన వ్యూహాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేసే పనిలో పడ్డారు. పోటీలో ఉన్న అభ్యర్థులు నెల రోజుల పాటు విస్తృత ప్రచారం నిర్వహించారు. చివరి 15 రోజులు ఉధృతంగా ప్రచారం చేశారు. అభ్యర్థులతో పాటు వారి మద్దతుదారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుని ఓట్లను అభ్యర్థించారు. మరోవైపు పోలింగ్‌కు మరో 24 గంటలు మాత్రమే సమయం ఉండడంతో, ఎన్నికల నిర్వహణలో అధికారులు తలమునకలై ఉన్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ స్థానానికి మొత్తం పది మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) తరుపున విజయగౌరి, ఎపిటిఎఫ్ తరుపున టిడిపి మద్దతుతో సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, పిఆర్‌టియు తరుపున మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు ప్రధానంగా పోటీ పడుతున్నారు. నోటిఫికేషన్ వెలువడిన తర్వాత గాదె శ్రీనివాసులు నాయుడు ప్రచారంలో కొంత హడావుడి కనిపించినా, తర్వాత పెద్దగా కనిపించలేదు. ఆ సంఘం నేతలు తప్ప ఆయన కూడా జిల్లాలో పెద్దగా పర్యటించలేదు. పార్టీలు, సంఘాల పరంగా మద్దతు పెద్దగా లేకపోవడంతో ఆయన వెనక్కి తగ్గినట్లు ఉపాధ్యాయుల్లో చర్చ సాగుతోంది. ఎపిటిఎఫ్ నుంచి పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మకు ఉపాధ్యాయులు, సంఘాల నుంచి పెద్దగా మద్దతు లేకపోవడంతో ఆయన టిడిపిని ఆశ్రయించి ఆ పార్టీ మద్దతును కోరారు. దీంతో కూటమి పార్టీల నాయకులు, ఆ పార్టీల శ్రేణులు ప్రచార బాధ్యతలను తమ భుజానకెత్తుకుని ప్రచారం సాగించారు. ఆయన వ్యక్తిగతంగా జిల్లాలో ఒక్కసారి మాత్రమే పర్యటించారు.

ప్రచారంలో పిడిఎఫ్ అభ్యర్థి ముందంజ

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి విస్తృతంగా ప్రచారం సాగించారు. జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలలను సందర్శించి ఓటర్లను కలుసుకున్నారు. ఆమె తరుపున ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు, ప్రజా, కార్మిక సంఘాల నాయకులు, శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆమెకు మద్దతుగా పూర్వ ఎమ్మెల్సీ, పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రమణ్యం తదితరులు జిల్లాలో ప్రచారం నిర్వహించారు. యుటిఎఫ్ మహిళా విభాగం తరుపున మహిళా ఉపాధ్యాయులు ఆమెకు మద్దతుగా ప్రచారం చేశారు.

సమస్యలపై గళమెత్తుతా.. అవకాశమివ్వండి

- విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తా
- మండలి ఎన్నికల్లో రాజకీయ జోక్యం భావ్యం కాదు
- విద్యారంగాన్ని దెబ్బతీసే పార్టీలు బలపరిచే అభ్యర్థులతో సమస్యలు పరిష్కారం కావు
- పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

ఈనెల 27న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే మండలిలో ఉపాధ్యాయుల సమస్యలపై గళమెత్తుతానని యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. మంగళవారం విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ శాసనమండలి అంటే పెద్దల సభని, అటువంటి సభలో పిడిఎఫ్ తరపున గెలుపొంది ఎమ్మెల్సీలుగా పనిచేస్తున్న అభ్యర్థులు ఎంతో హుందాతనంగా, రాజకీయాలకు అతీతంగా.. ఉపాధ్యాయుల, ఉద్యోగుల, పెన్షనర్ల, కార్మికుల సమస్యలపై పోరాటాలు చేస్తున్నారని చెప్పారు. పిడిఎఫ్ గత ఎమ్మెల్సీలూ ప్రజా గొంతుకగా నిలిచారన్నారు. శాసనమండలి ఉద్దేశాన్ని, హోదాను, ఉన్నతిని కాపాడి నిజాయితీగా ఉపాధ్యాయుల సమస్యలపై ప్రతిరోజూ పోరాటం చేస్తున్న పిడిఎఫ్ తరుపున తాను పోటీ చేస్తున్నానని చెప్పారు. విద్యా రంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సమస్యలపై తాను పోరాటం చేస్తానన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన జిఒ 117 వల్ల అనేక పాఠశాలలు మూతపడ్డాయని తెలిపారు. 3, 4, 5 తరగతులను హైస్కూళ్లలో విలీనం చేయడం వల్ల గ్రామీణ ప్రాంతంలో పాఠశాలలు మూతపడ్డాయని, తాము అధికారంలోకి వస్తే ఆ జిఒను రద్దు చేస్తామని గెలిచిన టిడిపి కూటమి ఆ తరువాత ఆ మాటను మరిచిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక పాఠశాలల ఉనికి లేకుండా సన్నాహాలు చేస్తోందని తెలిపారు. అదే జరిగితే మరిన్ని పాఠశాలలు మూతపడటం, ఉపాధ్యాయుల పోస్టులు లేకుండా పోవడం తథ్యమన్నారు. దీంతో ప్రభుత్వ విద్య అందని ద్రాక్ష అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్సీగా నెగ్గితే జిఒ 117 రద్దుకు పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. పవిత్రమైన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను కొన్ని రాజకీయ పార్టీలు కలుషితం చేశాయని, రాజకీయ పార్టీలు జోక్యం ఈ ఎన్నికల్లో ఉండటం భావ్యం కాదని అన్నారు. తాను ఎన్నో మహిళా ఉద్యమాలలో పాల్గొని, ప్రజా సేవా కార్యక్రమాలు చేశానని తెలిపారు. మండలి ఎన్నికల్లో గెలిస్తే రాజకీయాలకు, అవినీతికి తావులేకుండా నిజాయితీగా సేవ చేస్తానని, పిఆర్‌సి, ఇతర సమస్యలపై శాసన మండలిలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. సుదీర్ఘకాలం ఉపాధ్యాయుల సమస్యలపై పనిచేసి పరిష్కారం దిశగా కృషి చేసిన అనుభవం తనకు ఉందన్నారు. ఆరేళ్ల కాల ఉపాధ్యాయ వృత్తిని వదులుకొని ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముందుకు వచ్చానన్నారు. విద్యారంగాన్ని దెబ్బతీసే పార్టీలు బలపరిచే అభ్యర్థుల వల్ల సమస్యలు పరిష్కారం కావన్నారు. బ్యాలెట్ పేపర్‌లో 1వ నెంబర్‌లో ఉన్న తనకు ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.లక్ష్మీరాజా, విశాఖ జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు, కార్యదర్శి అంబేద్కర్, ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సుధాకరరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విజయగౌరి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- జిల్లాలో 31 పోలింగ్ కేంద్రాలు
- 5,035 మంది ఓటర్లు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - అరసవల్లి

ఈనెల 27న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాలో సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లాలో 31 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 5,035 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 3,416, మహిళలు 1,619 ఉన్నట్లు వివరించారు. వారంతా ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఓటరు స్లిప్పుల పంపిణీతో పాటు తగిన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. 27న ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగనుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద వీల్‌ఛైర్లు, ఎండ వేడి తగలకుండా షామియానాలు, తాగునీరు, బయో టాయిలెట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు, రేపు ఆంక్షలు

ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా ఈనెల 26, 27 తేదీల్లో ప్రత్యేక నిషేధ ఆంక్షలు విధిస్తున్నట్లు తెలిపారు. అన్ని పోలింగ్, పంపిణీ, స్వీకరణ, మధ్యంతర స్ట్రాంగ్‌రూం కేంద్రాల్లో ఈ ఉత్తర్వులు వర్తిస్తాయన్నారు. చట్ట వ్యతిరేకంగా గుమిగూడటం, సభలు, ర్యాలీలు నిర్వహించడం వంటి వాటిని పోలింగ్ సమయం ముగింపునకు 48 గంటల ముందు వరకు నిషేధాజ్ఞలు వర్తిస్తుందని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు పోలింగ్ కేంద్రం నుంచి 200 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి గుమిగూడకుండా నిషేధాజ్ఞలు విధించినట్లు తెలిపారు.

ఎంఎల్‌హెచ్‌ఒ ఆత్మహత్య

సహచర ఉద్యోగి వేధింపులే కారణం

ప్రజాశక్తి - సోంపేట

మండలంలోని బట్టిగల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంఎల్‌హెచ్‌ఒగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగిని వలిశెట్టి తులసి (22) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బారువ కొత్తూరుకు చెందిన తులసి బట్టిగల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంఎల్‌హెచ్‌ఒగా పనిచేస్తోంది. అదే ఆస్పత్రిలో ఫార్మాసిస్టుగా పనిచేస్తున్న మజ్జి ప్రదీప్ తరచూ వేధింపులకు గురిచేస్తున్నట్లు కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకొచ్చింది. తులసి తల్లి బోగమ్మ, సోదరి కుంభమేళాకు వెళ్లగా... తండ్రి, సోదరునితో తులసి ఇంట్లో ఉంది. మంగళవారం వేకువజామున తండ్రి, సోదరుడు బయటకు వెళ్లాక ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తిరిగి వచ్చి చూసిన తండ్రి హేమారావు, కూతురు విగతజీవిగా వేలాడి ఉండడంతో భోరున విలపించాడు. ప్రదీప్ వేధింపుల వల్లే తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని ఆమె తండ్రి ఫిర్యాదు చేసినట్లు బారువ ఎస్ఐ హరిబాబు నాయుడు తెలిపారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

తులసి (ఫైల్ ఫొటో)

'జ్ఞాన జ్యోతి'తో మరింత మెరుగైన విద్య

ఆమదాలవలస : జ్ఞాన జ్యోతి శిక్షణ ద్వారా అంగన్వాడీ కేంద్రాల్లో బాలలకు మరింత మెరుగైన విద్య అందించేందుకు దోహదపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.తిరుమల చైతన్య అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణలో నేర్చుకున్న అంశాలు కచ్చితంగా కేంద్రాల్లో అమలు చేయాలని సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సిడిపిఒ అనురాధ ఆధ్వర్యంలో ఆరో రోజు మంగళవారం నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న మొదటి విడత శిక్షణలో చిన్నారుల మేధో అభివృద్ధిపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పలు సామర్థ్యాలు, అంశాలు, నృత్యాలపై అంగన్వాడీలకు అవగాహన కల్పించారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్ తయారు చేయడం, అభివృద్ధిని అంచనా వేసే పద్ధతి, తల్లిదండ్రుల భాగస్వామ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి గెడ్డాపు రాజేంద్రప్రసాద్, అంగన్వాడీ సూపర్‌వైజర్లు లక్ష్మీబాయ్, లీలారాణి, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఇఒ తిరుమల చైతన్య

గంజాయి ముఠాల అరెస్టు

- వజ్రపుకొత్తూరు, సోంపేట, పలాస, ఇచ్ఛాపురంలో 14 మంది
- 76.59 కేజీలు స్వాధీనం
- యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దు
- కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు

ప్రజాశక్తి - పలాస, వజ్రపుకొత్తూరు, ఇచ్ఛాపురం

వజ్రపుకొత్తూరు, సోంపేట, పలాస, ఇచ్ఛాపురం మండలాల్లోని వేర్వేరు ఘటనల్లో గంజాయి తరలిస్తున్న 14 మందిని పోలీసులు అరెస్టు చేశారు. పలాస పోలీస్‌స్టేషన్ పరిధిలో 40 కేజీలు, వజ్రపుకొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు ఘటనల్లో 18.280 కేజీలు, ఇచ్ఛాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో 10.20 కేజీలు, సోంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 8.11 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వజ్రపుకొత్తూరు పోలీస్‌స్టేషన్‌లో కాశీబుగ్గ సిఐ డి.తిరుపతిరావు, ఎస్ఐ బి.నిహార్‌తో కలిసి కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు విలేకరుల సమావేశంలో ఆ మండలంలోని కేసు వివరాలను వెల్లడించారు. గంజాయి రవాణా చేస్తున్న ఒడిశా రాష్ట్రం గంజాంకు చెందిన మనయ్ సబర్, ప్రశాంతి మల్లిక్‌తో పాటు వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవుకు చెందిన బైనపల్లి షణ్ముఖను సోమవారం మధ్యాహ్నం బెండిగేటు జంక్షన్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి 8.280 కేజీల గంజాయి, ఒక మొబైల్ ఫోన్, ఒడిశా రిజిస్ట్రేషన్‌తో ఉన్న బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పూండీ రైల్వేస్టేషన్‌లో పది కేజీల గంజాయిని తరలిస్తున్న ఒడిశా రాష్ట్రం గంజాంకు చెందిన ప్రశాంత్ కుమార్ సాహు, భారతీ సాహు, ముంబయికి చెందిన నవాబ్ అహ్మద్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరి నుంచి గంజాయితో పాటు రెండు ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని మంగళవారం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

ఇచ్ఛాపురంలో ఇద్దరు అరెస్టు

ఇచ్ఛాపురం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ మీసాల చిన్నంనాయుడు, రూరల్ ఎస్ఐ శ్రీనివాస్‌తో కలిసి ఆ మండలంలో గంజాయి కేసు వివరాలను వెల్లడించారు. ఒడిశా నుంచి గంజాయి తరలిస్తున్న మహారాష్ట్రకు చెందిన రవిరామ దోత్రి, విశ్వనాథ తుకారంను మండలంలోని ఎం.తోటూరు ఎలిసి గేటు వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి 10.20 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

సోంపేటలో నలుగురు అరెస్టు

ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన ప్రదాన్ రాజేష్ సంతోష్‌భాయ్ అదే రాష్ట్రం కుదలాకు చెందిన సుబ్రమణ్యం నుంచి మూడు ప్యాకెట్లలో 6.210 కేజీల గంజాయిని తీసుకొని విశాఖపట్నం వెళ్లేందుకు సోంపేట బస్టాండ్‌లో ఉండగా పోలీసులు అరెస్టు చేశారు. మరో ఘటనలో ఒడిశా నుంచి 1.900 కేజీల గంజాయి కొని ఒకే మోటారు సైకిల్‌పై బారువ వస్తున్న గుంటూరు జిల్లా నవలూరుకు చెందిన ఎం.దినకర్, అదే జిల్లా అవిని గ్రామానికి చెందిన సవలం అన్వేష్, సోంపేట మండలం బారువ కొత్తూరుకు చెందిన కసరాపు దిలీప్‌ను అరెస్టు చేసినట్లు డిఎస్‌పి అప్పారావు తెలిపారు.

పలాసలో 40 కిలోలు పట్టివేత

పలాస రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో 40 కేజీల గంజాయిని తరలిస్తున్న ఒడిశా రాష్ట్రం రాయఘడ జిల్లా జిరా గ్రామానికి చెందిన నరేంద్ర లీమా, గజపతి జిల్లా సుందరదంగాకు చెందిన లిట్టు రాయత్‌ను అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణరావు తెలిపారు. మరో ఇద్దరు పరారయ్యారని చెప్పారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం మోహన గ్రామానికి చెందిన బబుల్లా ఉదయగిరిలో గంజాయి పండిస్తూ బెంగళూరుకి చెందిన పార్టీలకు కొంతమంది యువకుల ద్వారా పలాస రైల్వేస్టేషన్ నుంచి సరఫరా చేస్తుంటారని తెలిపారు. నరేంద్ర లీమా, లిట్టు రాయిత్, జిల్లు సుందర, బబుల్లా గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు వెళ్లేసరికి సుందర, బబుల్లా పరారయ్యారు. నరేంద్ర లీమా, రాయత్‌ను అరెస్టు చేసి 19 ప్యాకెట్లలో ఉన్న 40 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వజ్రపుకొత్తూరు : కేసు వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి వెంకట అప్పారావు

సమస్యల పరిష్కారానికి సాంకేతిక పరిజ్ఞానం

- మిషన్ మోడ్‌లో పిఎం సూర్యఘర్ యోజన
- 'ఉపాధి' కాంపోనెంట్ పనులపై ప్రత్యేక దృష్టి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - అరసవల్లి

ప్రజా సమస్యల పరిష్కారానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి రెవెన్యూ, ఉపాధి హామీ, పిఎం సూర్యఘర్, ఐసిడిఎస్, జిఎస్‌డబ్ల్యుఎస్, వైద్యారోగ్యం తదితర అంశాలపై సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్షించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పరిష్కరించిన ఫిర్యాదులపై ఆడిటింగ్ నిర్వహించాలని చెప్పారు. ఎపి సేవ, మీసేవ, పిజిఆర్ఎస్ దరఖాస్తుల స్థితిగతులపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి సాంకేతికతను ఉపయోగించాలని అధికారులకు సూచించారు.

పిఎం సూర్య ఘర్ యోజనను మిషన్ మోడ్‌లో చేపట్టాలని ఎంపిడిఒలు, విద్యుత్ శాఖ ఎఇలకు సూచించారు. రెవెన్యూ సదస్సులు, రీసర్వే, ఫిర్యాదులను పరిష్కరించడానికి అనుసరిస్తున్న విధానాలపై చర్చించారు. ఐ వి ఆర్ ఎస్ కాల్‌ల విశ్లేషణ, గృహ స్థలాల రీ వెరిఫికేషన్, అభ్యంతరం లేని ఆక్రమణల క్రమబద్ధీకరణ, ల్యాండ్ బ్యాంక్, కోర్టు కేసులు, లోకాయుక్త కేసులు తదితర వాటిపై అంశాల వారీగా మాట్లాడారు. ఉపాధి హామీ కింద మెటీరియల్ కాంపోనెంట్ పనులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరై ఇప్పుడు పురోగతిలో ఉన్న పనులకు బిల్లులు అప్‌లోడ్ చేయడంపై చర్చించారు. గ్రామ సచివాలయాలకు సంబంధించి గత సమావేశంలో చర్చించిన హాజరు, ఇతర సర్వేల స్థితిపై అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి హామీలు, జిల్లాలో అభివద్ధి పనుల పురోగతిపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, సిపిఒ ప్రసన్నలక్ష్మి, డిపిఒ భారతి సౌజన్య, వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాథస్వామి, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అనూష కేసును విచారణ చేయాలి

- నిందితున్ని కఠినంగా శిక్షించాలి
- ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి - మందస

లోహరిబంద జెడ్‌పి హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థి అనూష ఆత్మహత్య కేసుపై సమగ్ర విచారణ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పవిత్ర, డి.చందు డిమాండ్ చేశారు. కేసు విచారణను వేగవంతం చేసి, నిందితున్ని కఠినంగా శిక్షించాలని కోరుతూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనూష ఆత్మహత్య కేసులో రోజురోజుకీ అనుమానాలు పెరుగుతున్నాయన్నారు. నేటికీ పోస్టుమార్టం రిపోర్టు రాలేదని, పోలీసులు కూడా నిందితుడిని విచారణ చేయలేదని చెప్పారు. కేసు నీరుగార్చేందుకు రాజకీయ కుట్ర ఏమైనా ఉందా?, వేరే కారణాలేవైనా ఉన్నాయా అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయన్నారు. ఇప్పటికైనా సమగ్ర విచారణ చేసి నిందితుడిని చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కె.హేమంత్, పి.కార్తీక్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ముగ్గురు ఎంపిక

అరసవల్లి : నగరంలోని టౌన్ హాల్ వేదికగా మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఫెన్సింగ్ సబ్ జూనియర్స్ బాలురు, బాలికల ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో ఫెన్సింగ్ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యారని జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా తెలిపారు. అండర్-14 విభాగంలో బాలురుకు సంబందించి ఇప్పి కేటగిరిలో శాలిహుండం విశ్వాస్, ఫోయిల్ కేటగిరిలో గొండు అభిరామ్‌లు, బాలికలకు సంబంధించి ఫోయిల్ కేటగిరిలో బరాటం వేన్షిత ఎంపికైనట్లుగా చెప్పారు. మార్చి 1, 2 తేదీల్లో కృష్ణా జిల్లా కంచికచర్ల ఏక్తా స్కూల్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొంటారని అన్నారు. ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక ఎన్ఐఎస్ కోచ్ జోగిపాటి వంశీ ఆధ్వర్యాన నిర్వహించారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనబోయే జట్టుకి కోచ్‌గా జి.రాహుల్ వ్యవహరించనున్నట్టు తెలిపారు.

పోస్టల్ సేవలపై ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పోస్టల్ కార్యాలయాల్లో అందించే సేవలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ వి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి ఆరో తేదీన సర్కిల్ ఆఫీస్, విజయవాడలో చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కె.ప్రకాష్ స్వీకరించేందుకు నిర్ణయించారని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు నీలంరాజు రంగారావు, అసిస్టెంట్ డైరెక్టర్ (ఫిర్యాదులు, నిర్వహణ), చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ సర్కిల్, విజయవాడ-520013 కార్యాలయానికి పోస్ట్ కవరుపై 'డాక్ అదాలత్' అని పెద్ద అక్షరాలతో రాసి పోస్టు ద్వారా ఈనెల 28వ తేదీలోగా పంపించాలని కోరారు. నేరుగా ఫిర్యాదుల పరిష్కారం కోసం మార్చి ఆరో తేదీన ఉదయం 11 గంటలకు డాక్ అదాలత్‌కు చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ వారి కార్యాలయం, ఆంధ్ర ప్రదేశ్ సర్కిల్, విజయవాడ -13లో హాజరు కావచ్చని తెలిపారు. డాక్ అదాలత్‌లో గూగుల్ లింక్ https://meet.google.com /wsw-jeqa-jyi ద్వారా మార్చి ఆరో తేదీ ఉదయం 11 గంటల నుంచి వర్చువల్‌గా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. డాక్ అదాలత్‌లో ఫిర్యాదును పరిశీలించిన తర్వాత ఫిర్యాదుదారునికి ఫిర్యాదు, అర్జీ పరిష్కారం లేఖ, ఇ-మెయిల్ ద్వారా తెలియజేయనున్నట్లు తెలిపారు.

సమస్యలతో గిరిపుత్రులు సావాసం

చుట్టూ కనువిందు చేసే ఎత్తయిన కొండలు... మనసును ఆహ్లాదపరిచే పైరు గాలి... కొండల నుంచి పారే నీటి సవ్వడి ప్రకృతి ప్రేమికులకు ఎంతగానో కనువిందు చేస్తుంది. ఏడాదికొకసారి విహారయాత్రకు వచ్చే పర్యాటకులకు ఈ ప్రాంతం ఎంతగానో ఆకట్టుకుంటుంది. పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకునే మూడు కొండల నడుమ కనీస సౌకర్యాలు లేకపోవడంతో సమస్యలతో సావాసం చేస్తున్నారు గిరిపుత్రులు.

చిన్నచలమ గ్రామం

- అభివృద్ధికి ఆమడ దూరంలో కుగ్రామం
- పట్టని పాలకులు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని జంగాలుపాడు పంచాయతీ పరిధిలో ఉన్న చిన్నచలం గ్రామం. సీతంపేట మండలం కొన్ని గ్రామాల నుంచి బతుకు భారమై జీవనోపాధి కోసం 15 ఏళ్ల క్రితం ఈ మూడు కొండల నడుమ నివాసం ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి కాయకష్టం చేసుకుని పోడు వ్యవసాయం ద్వారా కుటుంబాలతో జీవనం సాగిస్తున్నారు. అయితే 2014లో ఈ ప్రాంతంలో ఏనుగులు సంచరిస్తూ బీభత్సవం సృష్టించాయి. దీంతో గిరిజనులు భయభ్రాంతులకు గురై జంగాలపాడు పంచాయతీ బాడ్లపాడుకు చేరుకున్నారు. ఐదేళ్ల తరువాత 2018లో తిరిగి కొండపైకి చేరుకున్నారు.

చలమ పేరు ఎలా వచ్చిందంటే...

కొండపై తాగునీటికి, ఇతర అవసరాలకు కొండపై నుంచి కిందకి జారువారే చలమల ద్వారా లభించే నీటిని వినియోగిస్తుండేవారు. దీనివల్ల ఈ గ్రామానికి చలమ అని పేరు పెట్టుకున్నారు. చలమల నుంచి వచ్చే నీటిని తమ నివాసం ఉండే ప్రాంతానికి తీసుకువచ్చేందుకు సీతంపేట ఐటిడిఎ అధికారులను సంప్రదించారు. అంతకుముందే గ్రామస్తులు తలో చెయ్యి వేసుకుని రూ.1.50 వ్యయంతో చలమల నుంచి పైపులైను వేసుకున్నారు. ఈ విషయాన్ని అప్పటి ఐటిడిఎ పిఒ దృష్టికి గిరిజనులు తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన అప్పటి పిఒ నీటిని స్టోరీ చేసుకునేందుకు వాటర్ ట్యాంకును, గ్రామానికి విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేశారు.

కొండల నడుమ రహదారి

తమ గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో కొండలు పక్కనుంచే దిగు ప్రాంతానికి వస్తున్నారు. ఈ విషయాన్ని అప్పటి పిఒ నవ్య దృష్టికి తీసుకెళ్లారు. పిఒ నవ్య పలు సందర్భంగా నడుచుకుంటూ ఈ ప్రాంతానికి చేరుకున్నారు. రహదారి ఏర్పాటు కోసం నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అదే సమయంలో ఎన్నికలు రావడం, బదిలీ కావడంతో రహదారి కష్టాలు తీరలేదు. దీంతో ఇప్పటికీ డోలి కట్టాల్సిందే. గ్రామంలో ఎవరికైనా ఆరోగ్యం బాగా లేకపోతే చేసేదేమీ లేక రోగిని డోలిపైన తీసుకోవాల్సిన పరిస్థితి.

బడులకు దూరం

గ్రామంలో అంగన్వాడీ, ప్రభుత్వ పాఠశాల లేదు. దీంతో విద్యకు దూరమవుతున్నారు. అలాగే పింఛను, రేషన్ కోసం కొండ దిగువన ఉన్న బొడ్లపాడు, జంగాలపాడు గ్రామాలకు ఊదు కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుంది. ఈ విషయాన్ని ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు ఇటీవల తీసుకెళ్లారు. అయినా రహదారి సమస్య తీరలేదు. ఇదిలా ఉంటే ప్రభుత్వం ఈ ప్రాంతంలో థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుంది. ఇదే నిర్మిస్తే తాము ఎక్కడికి పోవాలో? ఎలా జీవించాలో కూడా అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు స్పందించి తమ గ్రామానికి అవసరమైన మౌలిక సౌకర్యాలను, పాఠశాల ఏర్పాటు, రోడ్డును నిర్మించాలని కోరుతున్నారు. ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలను ఏర్పాటు చేయాలని విన్నవించుకుంటున్నారు.

మూలకు చేరిన తాగునీటి రక్షిత పథకం

మంచంపై రోగిని తీసుకెళ్తున్న గ్రామస్తులు

వైద్యం కోసం దూర ప్రాంతాలకు...

చిన్నపాటి రోగం వచ్చినా దూరప్రాంతాలకు వ్యయప్రయాసాలు కోర్చి శ్రీకాకుళం, పాలకొండ వెళ్తున్నాం. గ్రామంలో కనీసం ఆశా కార్యకర్త కూడా లేదు. ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండాపోయింది. అధికారులు స్పందించి ప్రాథమిక వైద్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి.

- సవర సుధారాణి, చిన్నచలమ

రోడ్డు లేక అవస్థలు

రోడ్డు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా నడిచి వెళ్లాల్సిందే. అత్యవసర సమయంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. కనీసం 108, 104 వాహనాలు రావడం లేదు. ఎటువంటి రోగమొచ్చినా డోలి కట్టాల్సిందే. ఎప్పటికైనా ఐటిడిఎ అధికారులు, పాలకులు స్పందించి రోడ్డును నిర్మించాలి.

- సవర హరవింద్, చిన్నచలమ

బయట ప్రపంచానికి దూరంగా ఉన్నాం

బయట ప్రపంచానికి దూరంగా ఉన్నాం. మాకు కనీస అవసరాలను తీర్చేందుకు చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా కనువిందుచేసే ఎత్తైన కొండలు ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం పర్యటక రంగంగా అభివృద్ధి చేస్తే బాగుంటుంది. దానివల్ల అభివృద్ధి చెందుతుంది. ఉపాధి కూడా దొరుకుతుంది.

- సవర వీరయ్య, చిన్నచలమ

నాలుగేళ్ల నిరీక్షణకు తెర

- తలసేమియా బాలునికి ధ్రువీకరణ పత్రం మంజూరు
- పింఛను మంజూరే ఆలస్యం
- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన



ధ్రువీకరణ పత్రం చూపిస్తున్న ప్రవీణ్ పురియా

ప్రజాశక్తి- కవిటి

ఎనిమిదేళ్లుగా తలసేమియా వ్యాధితో బాధపడుతూ నాలుగేళ్లుగా పింఛను మంజూరు కోసం తన వ్యాధి నిర్ధారణ ధ్రువీకరణ పత్రం కోసం వేచి చూస్తున్న ఆ బాలుడి నిరీక్షణకు తెరపడింది. బాలుడి ఆక్రందనను పింఛన్.. 'ఏడిపింఛెన్, తలసేమియా బాలుడిని ఏడి'పింఛన్' అంటూ ప్రజాశక్తి కథనాల రూపంలో ప్రచురించింది. దానికి స్పందించిన ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ చొరవ చూపించారు. ఎంపిడిఒ సహకారంతో కెజిహెచ్ సోమవారం ఆ బాలుడికి తలసేమియా వ్యాధి నిర్ధారణ గుర్తింపు పత్రం మంజూరు చేసింది. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని వరకకు చెందిన శ్రీను పురియా, రాణి పురియా దంపతుల కుమారుడు ప్రవీణ్ పురియా (7) 8 ఏళ్లుగా తల సేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. వలస కూలీలుగా హైదరాబాద్‌లో ఉన్న వీరి కుటుంబం బాబు వ్యాధి దృష్ట్యా స్వగ్రామానికి చేరుకుని దాతల సహాయంతో నెట్టుకొస్తోంది. ప్రతి 22 రోజులకొకసారి ప్రవీణ్‌కు రక్తం ఎక్కించడం కష్టంగా మారడంతో వీరు నాలుగేళ్లుగా పింఛన్ కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నారు. దీంతో వీరి దయనీయ పరిస్థితిని 'ప్రజాశక్తి' వెలుగులోకి తీసుకుకొచ్చింది. ప్రభుత్వ విప్, అధికారులు స్పందించి బాబుకి పింఛను మంజూరు కోసం అవసరమైన తలసేమియా వ్యాధి నిర్ధారణ పత్రం మంజూరు చేయించారు.

విప్ అశోక్ చొరవ

తలసేమియా బాలుడిని ఏడిపించెన్ అంటూ ప్రజాశక్తిలో వచ్చిన కథనాన్ని బొరివంక ఎంపిటిసి మాజీ సభ్యులు బెందాళం విజయ్ ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన విప్ బాలుడికి వ్యాధి ధ్రువీకరణ పత్రంతో పాటు పింఛను మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ శ్రీనివాస్‌రెడ్డిని ఆదేశించారు. ఎంపిడిఒ దృష్టిసారించి విశాఖపట్నం కెజిహెచ్‌లో ఆర్థోపెడిక్ యూనిట్ టు ఇన్‌ఛార్జిగా ఉన్న డాక్టర్ ఎల్.లోకనాథంను సంప్రదించారు. విశాఖపట్నం కెజిహెచ్‌లో బాలుడిని పూర్తిస్థాయిలో పరీక్షించిన డాక్టర్ లోకనాథం బృందం తల సేమియా వ్యాధి ధ్రువీకరణ పత్రం మంజూరు చేసింది. బాలుడి కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకుంటే వెంటనే పింఛను మంజూరు చేస్తానని ఎంపిడిఒ తెలిపారు.

'ప్రజాశక్తి'కి కతజ్ఞతలు

ఎనిమిదేళ్లుగా మేము పడుతున్న వ్యథ, నాలుగేళ్లుగా పింఛను కోసం పడుతున్న శ్రమను కళ్లకు కట్టినట్టు చూపించి మాకు న్యాయం జరిగేలా చేసిన 'ప్రజాశక్తి'కి ప్రత్యేక కృతజ్ఞతలు. అదేవిధంగా మాకు అనుక్షణం తోడుగా ఉన్న సామాజిక కార్యకర్త కాళీ సాహు, సహాయ సహకారాలు అందించిన వరక డిజిటల్ అసిస్టెంట్ పొల్లాయి అశోక్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

- శ్రీను పురియా, బాలుడి తండ్రి, వరక

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని కొండములగాంలో ఉన్న ఎపి మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఆరో తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్‌సి, ఎస్‌సి విద్యార్థులకు రూ.75, ఒసి, బిసి విద్యార్థులు రూ.150 పరీక్ష ఫీజు చెల్లించాలని అన్నారు. దరఖాస్తులు మార్చి 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రవేశ పరీక్షలు ఏప్రిల్ 20న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మోడల్ స్కూల్‌లోనే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 7702449892 ఫోన్ నంబరును సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బతికించుకుందాం

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ప్రభుత్వ పాఠశాలల ద్వారానే సమాజంలో నైతిక విలువలు పెంపొందుతాయని, సమానత్వ భావనలు ఏర్పడతాయని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. మెళియాపుట్టిలో యుటిఎఫ్ నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడిపై తల్లిదండ్రులలో నమ్మకాన్ని కలిగించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో విద్య ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ అయిపోయిందని, దానిలో భాగంగా 'నేను అనే' భావన ఏర్పడి, మానవీయ విలువలు సమాజంలో మృగ్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల ద్వారానే మనవియ విలువలు అభివృద్ధిలోకి వస్తాయన్నారు. బడిలో విద్యార్థులను చేర్చడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఎందరో త్యాగధనులు పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులు కనుమరుగవుతున్నాయని, వీటికి రాజకీయాలకు అతీతంగా ఉద్యమాలు చేయడం ద్వారానే మన హక్కులను పరిరక్షించుకోగలమని తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తున్న 12వ పిఆర్‌సి ఊసులేదని, డిఎలు, ఆర్థిక బకాయిలు చెల్లింపులు లేవని విమర్శించారు. 12వ కమిషన్ చైర్మన్ నియమించాలన్నారు. జిఒ నంబరు 117 రద్దుచేసి తీసుకురావాలనుకుంటున్న నూతన జిఒ కూడా పాత జిఒ లాగేనే ఉందని తెలిపారు. విద్యారంగాన్ని కాపాడుకునే దానికోసం ఉపాధ్యాయులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎ.లక్ష్మీనారాయణ, జిల్లా నాయకులు రవి తదితరులు పాల్గొన్నారు.

విజయగౌరి గెలుపు అవసరం

మెళియాపుట్టి : మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని మొదటి ప్రాధాన్య ఓటుతో గెలిపించాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మండలంలోని చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను మంగళవారం కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయ విద్యారంగ ఉద్యమం, ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారాలు తప్ప, వేరొక మరో వ్యక్తిగత జీవితం లేని వ్యక్తిత్వం విజయగౌరిదని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు, గిరిధర్, ఎల్.వి.చలం, ఎ.లక్ష్మీనారాయణ, రవికుమార్, కుమారస్వామి పాల్గొన్నారు.

లావేరు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల గెలుపు అవసరమని, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థి, ఉద్యమ నేత, మహిళా నాయకులు కోరెడ్ల విజయగౌరికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ పిలుపు నిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండలంలోని అదపాక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యారంగ పరిరక్షణకు ఉపాధ్యాయుల, అధ్యాపక సంక్షేమానికి పోరాడుతున్న విజయగౌరి గెలుపుకు ఉపాధ్యాయు లు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రిఫరెన్షియల్ ఓటింగ్ ప్రక్రియలో నిర్వహిస్తున్నారని అన్నారు. ఇతర సంఘాల నాయకులు, కార్యకర్తలు తమ రెండో ప్రాధాన్యత ఓటును విజయగౌరికి వేయాలన్నారు. విద్యార్థులందరికీ నాణ్యమైన శాస్త్రీయ విద్య, ఉపాధ్యాయ అధ్యాపక ప్రయోజనాలు, 12వ పిఆర్‌సి, ఉద్యోగోన్నతి, సిపిఎస్ రద్దు, డిఎ చెల్లింపులు, ఆర్థిక బకాయిలు చెల్లింపులు, తదితర సమస్యలు సాధన, పరిష్కారాలు ఉద్యమాల ద్వారానే సాధించగలమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, స్టాఫ్ సెక్రటరీ పుట్టా ఉదయ్‌కుమార్, ఇన్‌ఛార్జి హెచ్ఎం జి.బాలకృష్ణ, ఉపాధ్యాయులు ఎన్.కృష్ణారావు, పి.లక్ష్మణరావు, జి.మురళి, ఎ.వాసుదేవరావు, బొడ్డేపల్లి జనార్ధనరావు పాల్గొన్నారు.

లావేరు : ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

మందస : మాట్లాడుతున్న బాబూరావు

మందస : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరిని గెలిపించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు పునిచ్చారు. మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు, కెజిబివి, అంబేద్కర్ గురుకులం పాఠశాలల్లో ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గున్న రమేష్, మండల పూర్వ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిన్నింటి కొండలరావు, కొర్ల సోమేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్లు లండ రాజారావు, పల్లి జగన్మోహనరావు, తరణి సోమేశ్వరరావు, మండల సిపిఎస్ కన్వీనర్ దుగాన మాధవరావు, సీపాన సూర్యనారాయణ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

పరిశీలిస్తున్న తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి

పలాస : ఈ నెల 27న నిర్వహించనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు స్థానిక జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రాన్ని తహశీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి మంగళవారం పరిశీలించారు. ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు ఎలా ఉండాలి, ఏమి చేయాలని సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సంబంధించి పలాస మండలంలో 280 మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 195 మంది, 85 మంది మహిళలు ఉన్నారన్నారు. వజ్రపుకొత్తూరు మండలంలో 78 మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 63 మంది, మహిళలు 15 మంది ఉన్నారని తెలిపారు. మందస మండలంలో 178 మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 146, మహిళలు 33 మంది ఉన్నారని పేర్కొన్నారు. పలాస కేంద్రంగా డివిజన్‌లోని 8 మండలాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు ఏ మండలానికి ఆ మండల కేంద్రంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసి నిర్వహించనున్నారు. అయితే డివిజన్‌లో 8 మండలాల్లో ఈ ఎన్నికలకు సంబంధించి సామగ్రి బుధవారం పలాస కేంద్రం నుంచి ఆయా మండలాలకు తరలించనున్నామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఈయనతోపాటు ఆర్ఐ ఖగేశ్వరరావు, ఎలక్షన్ డిటి గిరి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సైన్స్ ప్రయోగాల్లో 'విశ్వశాంతి' ప్రతిభ అమోఘం

పరిశీలిస్తున్న ఎంఇఒ శ్రీనివాస్ నాయక్

ప్రజాశక్తి- పోలాకి

సైన్స్ పరిజ్ఞానం ద్వారా ప్రయోగాలు చేయడంలో విశ్వశాంతి విద్యార్థులు ప్రతిభ అమోఘమని ఎంఇఒ శ్రీవాస్ నాయిక్ అన్నారు. పోలాకి కేంద్రంలోని విశ్వశాంతి హైస్కూల్‌లో సైన్స్ డే వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సైన్స్ ఎక్స్పో కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఎంఇఒ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. విద్యార్థులు అటల్ టింకరింగ్ ల్యాబ్ పరిజ్ఞానంతో కోడ్ సిస్టం అనుసరించి తయారు చేసిన 54 రకాల సైన్స్ ప్రాజెక్టులను పరిశీలించారు. ఇందులో ల్యాండ్ మైన్ డిటెక్టర్, రైల్వేస్టేషన్ ఏక్సిడెంట్ కంట్రోల్ సిస్టం,ెయిన్ అలారం, ఎక్జామ్ పేపర్ లీకేజ్ డిటెక్టర్, సోలార్ ఫెన్సింగ్, బ్యాంకు సెక్యూరిటీ సిస్టం ప్రాజెక్టులు తయారీలో, వాటి పనితీరు, వాటిని విద్యార్థులు వివరించే విధానం పరిశీలించి ముగ్ధులయ్యారు. సైన్స్ ప్రయోగాల ద్వారా విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత వెలికితీసి వారి భవిష్యత్‌కు బంగారు బాటవేస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం మెట్ట ఊర్మిళ, మెట్ట జనార్ధనరావు దంపతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు సెలవుపై సందిగ్ధత

ప్రజాశక్తి- టెక్కలి

శివరాత్రి మరుచటి రోజు పాఠశాలలకు సెలవు మంజూరుపై ఉపాధ్యాయుల్లోను, సంఘాల్లోను అస్పష్టత నెలకుంది. ఏటా శివరాత్రి మరుచటి రోజు లోకల్ సెలవు మంజూరు చేయించుకునే అవకాశం ఉంది. అయితే ఈ సారి శివరాత్రి మరుచటి రోజే ఎమ్మెల్సీ ఎన్నిక ఉండడంతో ఓటింగ్‌లో పాల్గొనే ఉపాధ్యాయులకు సెలవు మంజూరుపై ఉన్నతస్థాయి అధికారులు చేస్తున్న ప్రకటనలు ఉపాధ్యాయులను గందరగోళానికి నెట్టేస్తున్నాయి. ఓటింగ్‌లో పాల్గొనే ఉపాధ్యాయులకు ఎస్‌సిఎల్ మంజూరు చేస్తూ... ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే పాఠశాలలు ఎట్టి పరిస్థితుల్లోనూ మూతపడకూడదని విద్యాశాఖాధికారులు ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ, విద్యాశాఖ ఆదేశాల మధ్య నెలకున్న అస్పష్టతపై సందిగ్ధ నెలకుంది. రెవెన్యూ శాఖాధికారుల ఆదేశాల మేరకు ఒక పాఠశాలలో ఓటు హక్కు ఉన్న ఉపాధ్యాయులందరికీ ఎస్‌సిఎల్ మంజూరైంది. దీంతో ఎవ్వరూ పాఠశాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఇటువంటి తరుణంలో విద్యాశాఖాధికారులు మాత్రం తప్పనిసరిగ్గా పాఠశాలలు తెరవాలని, ఓటు హక్కు ఉన్న కొందరు ఉపాధ్యాయులు ఒక పూట, మిగిలిన వారు మరోపూట చొప్పున విధులు నిర్వర్తించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇదిలా ఉండగా ప్రయివేట్ విద్యా సంస్థల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు మాత్రం తమ విధులకు హాజరయ్యేందుకు కొంత సమయం వెసులుబాటు కల్పిస్తూ... ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ సమయంలోనే ఓటింగ్‌లో పాల్గొమని ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎంఎల్‌సి ఎన్నిక రోజు సెలవుపై స్పష్టత లేకపోవడంతో చాలా మంది ఉపాధ్యాయులు గురువారం లోకల్ సెలవు దినం ప్రకటించుకోవడం గమనార్హం. ఈ విషయమై సంబంధిత విద్యాశాఖాధికారులు స్పష్టత నివ్వకపోవడంతో ఉపాధ్యాయుల మధ్య గందరగోళ పరిస్థితి నెలకుంది. దీనిపై స్వయంగా కలెక్టర్ దృష్టిసారించి స్పష్టత నివ్వాలని ఓటింగ్‌లో పాల్గొనే ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ప్రజాశక్తి- కొత్తూరు

పొదుపే లక్ష్యంగా మహిళలు ముందుకుపోవాలని యూనియన్ బ్యాంకు మేనేజర్ ఎ.అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని లబ్బలో కర్నూలుకు చెందిన సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ నేతృత్వంలో గిరిజన మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల ఆర్థిక బలోపేతానికి బ్యాంకులు ఎప్పుడూ సహకరిస్తామన్నారు. కానీ నిర్దిష్ట, పటిష్టమైన ప్రణాళికలు ఎంతో అవసరమని అన్నారు. అటువంటి దృక్పథంలో మహిళలు హోమ్ మేకర్స్ ఉండాలని సూచించారు. ఆదాయాభివృద్ధి కార్యక్రమాల నిర్వహణతోనే మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధ్యమన్నారు. గిరిజన ప్రాంతం కావడంతో చింతపండు ఎక్కువగా లభ్యమౌతుందని, ఏదైనా ఒక ఎస్‌హెచ్‌జి పిక్క తీసి కేకేల రూపంలో వ్యాపారం చేయడానికి ముందుకొస్తే యూనియన్ బ్యాంకు రుణం, మిషనరీ కొనుగోలు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తామని సభ్యులకు భరోసా ఇచ్చారు. బ్యాంకు పరిధిలోని సామాజిక భద్రతా పింఛన్లు, బీమాలు, సైబర్ ఫ్రాడ్స్‌పై సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తులాల రాజకుమారి, సంస్థ కౌన్సిలర్లు హేమలత, వెంకటేశలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మేనేజర్ అశోక్‌కుమార్

శ్రీముఖలింగంలో శివరాత్రి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి- జలుమూరు

మండలంలోని శ్రీముఖలింగంలో శ్రీముఖలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నుంచి నిర్వహించనున్న శివరాత్రి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ దర్శనానికి క్యూలైన్లు ఆలయంలోను, ఆలయం బయట బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ వేడుకలు 26,27,28 తేదీల్లో నిర్వహించనున్నారు. దర్శనాలకు వచ్చే యాత్రికులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు మొబైల్ మరుగుదొడ్లను మహిళలకు, పురుషులకు వేర్వేరుగా ఏర్పాటు చేశారు. వైద్య ఆరోగ్యశాఖ నాలుగు బృందాలుగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసింది. చక్రస్నానాలకు వెళ్లే దారిలో యాత్రికులకు తాగునీటి సౌకర్యం, నడిచే దారిని చదును చేసి బ్లీచింగ్‌తో శుభ్రం చేశారు. సిసి కెమేరాలు, డ్రోన్లు ఏర్పాటు చేసి క్యూలైన్లు, తదితరమైన వాటిని కంట్రోల్ రూం ద్వారా నిశితంగా పరిశీలిస్తారు. ఆలయాన్ని లైటింగ్, పూరణతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయానికి వచ్చే మార్గంలో లైటింగ్ ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో ఉన్న భక్తులకు ఎండదెబ్బ తగులకుండా టెంట్లు ఏర్పాట్లు చేశారు. పార్కింగ్, గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఏర్పాటు చేసిన బారికేడ్లు

అప్పలు మృతదేహం

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

టెక్కలి రూరల్ : టెక్కలి తెంబూరు రోడ్డు కూడలి వద్ద ఉన్న రైల్వే గేట్ సమీపంలో మంగళవారం రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. మండలంలోని రాధవల్లపురానికి చెందిన బగాది అప్పలు (62) ట్రాక్ దాటుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న రైల్వే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతిని కుటుంబ సభ్యులు సమాచారం అందజేశారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగును రెండో భాషగా కొనసాగించాలి

పొందూరు: ఇంటర్మీడియట్‌లో తెలుగును సెకెండ్ లాంగ్వేజ్‌గా తప్పనిసరిగా కొనసాగించాలని సిఎంలను, విద్యాశాఖ మంత్రిని పియుసి చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ విజ్ఞప్తి చేశారు. ఎపి అసెంబ్లీ సమావేశాల్లో మంగళవారం పలు అంశాలపై మాట్లాడారు. ఇటీవల ఇంటర్మీడియట్‌లో తెలుగు భాషను ఆప్షనల్ సబ్జెక్టుగా కాకుండా సెకండ్ లాంగ్వేజ్‌గా తప్పనిసరిగా కొనసాగించాలని కోరుతూ తెలుగు అధ్యాపకులు రమణ, రాజేష్‌లు ఇటీవల వినతిపత్రాన్ని అందజేశారు. దీంతో ఈ విషయాన్ని ఆయన అసెంబ్లీలో ప్రస్తావిస్తూ తెలుగు భాష అంటే అమ్మ భాషని, ఈ తెలుగు భాషను దూరం చేసే ప్రయత్నం గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని అన్నారు. ఇంటర్మీడియట్‌లో తెలుగు సెకండ్ లాంగ్వేజ్‌గా లేకపోయినట్లయితే విద్యార్థులు చాలా ఇబ్బందులు పడతారని తెలిపారు.

పిడిఎఫ్ అభ్యర్థికి మద్దతు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరికి సీనియర్ ఉపాధ్యాయ నాయకుడు, న్యాయవాది బొడ్డేపల్లి మోహనరావు మద్దతు ప్రకటించారు. మేధావి వర్గానికి చెందిన ఉపాధ్యాయులు ప్రశ్నించే గొంతులను సమర్థించాలని కోరారు. ఇందులో ప్రభుత్వాల జోక్యం తగదని అభిప్రాయపడ్డారు. గడిచిన రెండు దశాబ్దాల్లో ప్రలోభాలకు, రాజకీయ పార్టీల ప్రభావాలకు ఉపాధ్యాయులు, పట్టభద్రులు లోను కావడం బాధాకరమన్నారు. ఉపాధ్యాయ ఉద్యమాలతో సంబంధం లేని వారు, వారి సంక్షేమం కోసం కనీసం కృషి చేయని వారు కూడా పోటీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో గెలిచినవారు శాసనమండలిలో ఉపాధ్యాయుల సమస్యలను కూడా ప్రస్తావించలేదని, ఈ వాస్తవాలను ఉపాధ్యాయవర్గం గుర్తించాలని కోరారు. జి.రాహుల్ వ్యవహరించనున్నట్లు తెలిపారు.

మద్యం షాపుల మూత

ఇచ్ఛాపురం : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్ అదేశాలు మేరకు మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి ఈ నెల 27 సాయంత్రం 4 గంటల వరకు మద్యం షాపులు మూసివేసినట్లు ఎక్సైజ్ సిఐ పి.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కవిటి, ఇచ్ఛాపురం మండలం, మున్సిపాలిటీ పరిధిలోని మద్యం షాపులను మూసివేశామని అన్నారు.

పరిశీలిస్తున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

శివరాత్రి ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని రావివలసలో ఉన్న ఎండల మల్లికార్జున స్వామి ఆలయంలో బుధవారం శివరాత్రి నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లను ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎండ తీవ్రంగా ఉండడంతో టెంట్లు ఏర్పాటు చేయాలని గుర్నాథరావుకు ఆదేశించారు. పారిశుధ్యం లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కార్యదర్శి పి.రవికుమార్‌కు ఆదేశించారు. దేవాదాయశాఖ, పంచాయతీరాజ్, పోలీసులు సమన్వయంతో పనిచేయాలన్నారు. యాత్రికులకు తాగునీరు, మజ్జిగ, ప్రసాదాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డిఎల్‌పిఒ బాలగోపాల్, టిడిపి నాయకులు ఎల్.ఎల్.నాయుడు పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న కమిషనర్ రామారావు

బిల్లుల చెల్లింపులో అలసత్వం వద్దు

మున్సిపల్ కమిషనర్ రామారావు

ప్రజాశక్తి- పలాస

అభివద్ధి పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో అలసత్వం వహించవద్దని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు సూచించారు. పురపాలక సంఘం కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే వేసవిలో తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎల్లమ్మతల్లి జాతరకు తీసుకోవాల్సిన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. సమావేశంలో డిఇ కనకరాజు, ఎఇ కిరణ్ పాల్గొన్నారు.

చైతన్యను సన్మానిస్తున్న జెసిఐ సభ్యులు

సైకిల్ యాత్రికునికి సన్మానం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

నెల్లూరు టౌన్‌కు చెందిన చైతన్య పర్యావరణ పరిరక్షణకు గో గ్రీన్ అనే సిద్ధాంతంతో చెట్లు గొప్పతనం, వాటి ఆవశ్యకతను అందరికీ అవగాహన కల్పిస్తూ.. సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా మంగళవారం ఇచ్ఛాపురం చేరుకోవడంతో జెసిఐ నాయకులు ఘనంగ స్వాగతం పలికారు. అలాగే దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ చెట్లు గొప్పతనం తెలియజేయడానికి ఈ నెల 9న సైకిల్ యాత్ర ప్రారంభించానని తెలిపారు. అనంతరం ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో మొక్కలు నాటారు. ఇందుకు సహకరించిన ప్రిన్సిపాల్ శంకర్‌రావుకి, సిబ్బందికి జెసిఐ ప్రెసిడెంట్ కాళ్ల జైదేవ్, ప్రాజెక్టు చైర్మన్ సంతోష్‌సాహు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జెసిఐ సభ్యులు డాక్టర్లు మోహన్, మట్టా శ్రీనివాస్, వెంకటేష్, షణ్ముఖరావు, స్వరూప్, రాజ్‌కమల్, ప్రేమ్‌సాయి, అనిత్ పాల్గొన్నారు.

ముగిసిన అంగన్వాడీల శిక్షణ

ప్రజాశక్తి- పొందూరు

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరు రోజులుగా అంగన్వాడీలకు నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమం మంగళవారంతో ముగిసిందని సిడిపిఒ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా పిల్లల్లో సమగ్ర అభివృద్ధి పెంపొందించే వివిధ సామర్ధ్యాల ప్రాముఖ్యత, కృత్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్వాడీలకు శిక్షణ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.వి.రత్నం, సిఆర్‌పిలు సత్యనారాయణ, శ్రీనివాసరావు, అప్పలరాజు పాల్గొన్నారు.

టెక్కలి : శిక్షణ అనంతరం పాల్గొన్న అంగన్వాడీలు

టెక్కలి : అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆయాలకు పాఠశాల్లో ప్రీ ప్రైమరీ విద్యను అందించే క్రమంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు నిర్వహించిన జ్ఞాన జ్యోతి శిక్షణ ముగిసింది. ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావులు మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను అవగం చేసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిఆర్‌పిలుగా వ్యవహరించిన మోహనరావు, ధనుంజయరెడ్డిలను అభినందించారు. కార్యక్రమంలో మండల రీసోర్సు సిబ్బంది సంతోష్‌కుమార్, రవి పాల్గొన్నారు.

కవిటి: వచ్చే విద్యా సంవత్సరంలో 3 నుంచి 6 సంవత్సరాల పిల్లల్లో ప్రతిభాపాటవాలు వెలికితీసేందుకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయని ఎంఇఒ ధనుంజయ మజ్జి అన్నారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరు రోజులుగా నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఈ శిక్షణలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన అంగన్వాడీ కార్యకర్తలను సన్మానించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు లక్ష్మి, కృష్ణవేణి, పల్లవి పాల్గొన్నారు.

పొందూరు : శిక్షణలో పాల్గొన్న అంగన్వాడీలు, సిఆర్‌పిలు

ఇచ్ఛాపురం : మండలంలోని బాలికోన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి శిక్షణ ముగిసింది. కార్యక్రమంలో ఎంఇఒలు కురమాన అప్పారావు, ఎస్.విశ్వనాథం, సిడిపిఒ నాగరాణి, ప్రధానోపాధ్యాయులు పి.వి. రమణమ్మ పాల్గొన్నారు.

సోంపేట : జ్ఞానజ్యోతి పేరిట ఆరు రోజులుగా అంగన్వాడీ కర్యకర్తలకు ప్రభుత్వం ఇస్తున్న శిక్షణ ముగిసింది. సోంపేట బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఇఒ జోరాడు కృష్ణంరాజు, సిడిపిఒ ఇందిరా, సూపర్‌వైజర్లు, డిఆర్‌పిలు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : అంగన్వాడీ కార్యకర్తలు జ్ఞానజ్యోతి శిక్షణతో సుక్షితులై బాలబాలికల సర్వతోముఖాభివృద్ధికి పాటు పడాలని ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు అన్నారు. పాతటెక్కలి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణ ముగిసింది. కార్యక్రమంలో ఎంఇఒ దాశరథి, డిఆర్‌పిలు సూర్యారావు గుప్తా మాస్టర్, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పేదల ఇళ్లు కూల్చడం సరికాదు

సిపిఐ జిల్లా కార్యదర్శి వెంకటరమణ

ప్రజాశక్తి- పలాస

కూటమి ప్రభుత్వం అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లు కూల్చడం సరికాదనిసిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అన్నారు. కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సూదికొండ ప్రాంతంలో దాదాపు తొమ్మిదెకరాల భూమిలో పేదలకు 40 ఇళ్లు కట్టుకుని జీవనాన్ని సాగిస్తున్నారని అన్నారు. సెంట్రల్ స్కూల్ నిర్మాణానికి వారం రోజులు ముందు నోటీసులు తయారు చేసి ప్రొక్లెయినర్ సహాయంతో ఇళ్ల కూల్చి నేలమట్టం చేశారని అన్నారు. కనీసం ప్రజలతో సంప్రదించకపోవడం సరికాదన్నారు. 40 ఏళ్లుగా ఈ ప్రాంతంలో ఉంటున్న ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ప్రజలను కూర్చోబెట్టి

మాట్లాడుతున్న వెంకటరమణ

మాట్లాడాలన్నారు. సెంట్రల్ స్కూల్ తెచ్చి అభివృద్ధి చేస్తారంటే స్వాగతిస్తున్నామని, పేదలు నివాసం ఉంటున్న భూములే మీకు అవసరమయ్యాయాయని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వేణుగోపాల్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు గోపి, కుమార్, బాధితులు దాసరి రాజు, సంధ్య, రమా పాల్గొన్నారు.

మిత్రుని కుటుంబానికి ఆర్థికసాయం

పలాస : మిత్రుడు మృతి చెందడంతో ఆ కుటుంబం వీధిన పడింది. వారికి సహాయం చేయాలనే ఉద్దేశంతో మొత్తంతా కలసి రూ.1.06 లక్షలు పోగుచేసి మంగళవారం ఆర్థికసాయం అందించి ఉదారత చాటారు. పలాసకు చెందిన హైస్కూల్లో 1987-88కి చెందిన రమేష్ పండా ఇటీవల మృతి చెందాడు. వారి కుటుంబానికి పెద్దదిక్కు కోల్పోవడంతో ఏమిచేయాలో, ఎవరికి సహాయం అడగాలో తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన మిత్రులంతా కలిసి వారి కుటుంబానికి సహాయపడాలనే ఉద్దేశంతో చందాలు పోగుశారు. వారి పిల్లల చదువుల కోసం సహాయ పడగలమని భరోసా ఇచ్చారు. మిత్రుల ఉదారతను స్థానికులు కొనియాడుతున్నారు. కార్యక్రమంలో హైస్కూల్ బ్యాచ్‌కు చెందిన కొత్తకోట తిరుమలరావు, పూలదాసు శ్రీను, సతీష్, వడ్డీ విఠల్, కిషోర్, అప్పలస్వామి, సత్య, గిరిగోపాల్, రాము తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

ఆమదాలవలస : నియోజకవర్గంలోని పొందూరు మండలంలో చేపట్టనున్న 367 పనులకు రూ.38.12 కోట్లు నిధులు మంజూరైనట్లు టిడిపి కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదలైంది. ఉపాధి హామీ ద్వారా ఈ పనులకు 2024-25 ఆర్థిక సంవత్సర పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యాన నిధులు మంజూరుకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపింది. పొందూరు మండలం సమగ్ర అభివృద్ధికి నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఎమ్మెల్యే కూన రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

వైద్య సిబ్బందితో బాలాజీ

వైద్య శిబిరానికి స్పందన

ఎచ్చెర్ల: ఆర్‌జియుకెటి శ్రీకాకుళం క్యాంపస్-2 లో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని స్పందన లభించింది. ఈ శిబిరానికి డైరెక్టర్ బాలాజీ, ఎఒ రామకృష్ణ, ఎఫ్ఒ వాసు, డీన్ అకడమిక్స్ మోహన్‌కృష్ణ చౌదరి, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ గేదెల రవి, క్యాంపస్-2 ఇన్‌ఛార్జి సాగర్ సహాయ సహకారాలు అందించారు. శ్రీకాకుళం మెడికోవర్, రాగోలు జెమ్స్, న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్‌తో కలిసి ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించగా, 300 మందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు. ఈ శిబిరంలో చర్మ సంబంధిత సమస్యలు, సాధారణ ఆరోగ్య సమస్యలు, నేత్ర సమస్యల వంటి చికిత్సలను వైద్యులు అందించారు.

వైభవంగా కళ్యాణం

శ్రీకాకుళం రూరల్: మండలంలోని కిష్టప్పేటలో పార్వతి సమేత కైలాశేశ్వర 22వ వార్షికోత్సవ మహోత్సవాలు కన్నుల పండగ నిర్వహించారు. ఈ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు ధర్మకర్త గొండు జగన్నాథరావు దంపతులు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, స్వాతి దంపతులు, డాక్టర్ గంగాధర్, హరిత దంపతులు పాల్గొన్నారు.

సందడిగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి- కొత్తూరు

విద్యార్థులకు మార్కులు కాదు... మార్పు ముఖ్యమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ ప్రిన్సిపాల్ ఎద్దు గోపాల్‌దాస్ నాయుడు అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గోవిందరావు అధ్యక్షతన మంగళవారం వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుకున్న పాఠశాల నుంచి చీఫ్ గెస్ట్‌గా ఆహ్వానం అందే విధంగా ఆ స్థాయికి చేరుకోవాలన్నారు. పది మందిలో మొదటి పేరు మనదై ఉండాలన్నారు. ఎంఇఒ-2 శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఏ స్థాయిలో ఉన్నా గురువులను, తల్లిదండ్రులను మరిచిపోరాదన్నారు. అలాంటప్పుడే వారు ఉన్న స్థాయిలో ఎదుగుతారన్నారు. గణిత ఉపాధ్యాయులు పిండితేజేశ్వర మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువ శాతం చదువుపై దృష్టిసారించాలన్నారు. అనంతరం విద్యార్థులు ఆటాపాటలతో, నృత్యాలతో హాస్య భరితంగా సబికులను ఆనందింపచేశారు. కార్యక్రమంలో ఎంఇఒ-1 సిహెచ్.గోవిందరావు, పారాపురం సర్పంచ్ కుంచాల రత్నాలు, విద్యా కమిటీ చైర్‌పర్సన్ కళావతి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: విద్యార్థులు బాగా చదివితేనే వారికి భవిష్యత్‌లో పేరు ప్రఖ్యాతలు వాటంతట అవే వస్తాయని ఎంఇఒ ఎల్.వి.ప్రతాప్ అన్నారు. మండలంలోని ఎత్తురాళ్ళపాడు సమీపంలో ఉన్న సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహించిన 22వ వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సరస్వతి విద్యానికేతన్ చీఫ్ అడ్వైయిర్ గురువెల్లి అప్పన్న, కరస్పాండెంట్ చాప శ్రీనివాస్ భావని, ప్రిన్సిపాల్ తమ్మినేని లక్ష్మణరావు, ఇన్‌ఛార్జి ఎన్.జగదీష్‌లు ఎంఇఒను సన్మానించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం బహుమతులు అందజేశారు.

నరసన్నపేట : విద్యార్థులకు నైపుణ్యతతోనే ఉపాధి అవకాశాలు పొందవచ్చని వ్యక్తిత్వ వికాస నిపుణులు దుప్పల రవికుమార్ అన్నారు. స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలు సందడిగా సాగాయి. నేర్చుకున్న జ్ఞానం పది మందికీ ఉపయోగపడుతూ సమాజహితం కావాలన్నారు. సాంకేతికంగా ప్రపంచం మారుతోందని, రానున్న రోజుల్లో విప్లవాత్మకమైన మార్పులు రాబోతున్నాయని అన్నారు. దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం యువత పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల డైరక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్, పాగోటి రామచంద్రరావు, ఎస్.కైలాశరావు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకుగా సాగాయి.

రణస్థలం రూరల్: విద్యార్థి దశ నుంచే సృజనాత్మక అవసరమని ఎంఇఒ అజ్జాడ త్రినాథరావు, జె.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవిలు అన్నారు. మండలంలోని కోష్ట కూడలిలో ఉన్న నారాయణ స్కూల్ పదో తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిలుగా పాల్గొని మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్య మాత్రమే జీవితాన్ని ఉన్నత స్థితిలో నిలబెట్టి నడిపిస్తుందన్నారు. తల్లిదండ్రులను, సమాజాన్ని గౌరవిస్తూ ఎట్లాంటి దురలవాట్లకు లోనుకాకుండా నవసమాజ నిర్మాణానికి యువత పాటుపడాలన్నారు. కార్యక్రమంలో గిరి ప్రసాద్, కోష్ట మాజీ సర్పంచ్ పిషిణి జగన్నాథం నాయుడు, ఎంపిటిసి మాజీ సభ్యులు పైడి అప్పడుదొర, శంకర్, కెల్ల రమణ, పాఠశాల డైరెక్టర్ కెల్ల మంజు భార్గవి, కరస్పాండెంట్ కెల్ల గోవింద, ప్రిన్సిపాల్ సిగడాపు గౌరినాయుడు పాల్గొన్నారు.

పలాస : మండలంలోని బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాలలో పదో తరగతి, జూనియర్ కళాశాలలో ఇంటర విద్యార్థులు వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంసతిక ప్రదర్శనలు అందరినీ

నరసన్నపేట : సన్మానిస్తున్న స్కూల్ యాజమాన్యం

ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.వి.రమణారావు, ఉపాధ్యాయులు ఈశ్వరరావు, మధుబాబు, రమేష్, కొయ్యల శ్రీనివాసరావు, సుధాకుమారి, పద్మలోచనం, జనార్ధనరావు పాల్గొన్నారు.

బూర్జ : విద్యార్థులు క్రమశిక్షణతో పాటు దీక్ష, పట్టుదల ఉంటే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అదరోహించవచ్చునని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఎన్.తవిటినాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్ డే వేడుకలు నిర్వహించారు. సాంస్కృతిక నృత్యాలతో విద్యార్థులు అందరినీ అలరించారు.

సోంపేట : పట్టణంలోని మహర్షి విద్యా నికేతన్, వివేకానంద విద్యా కేంద్ర శిశుమందిర్, స్థానిక జిల్లా పరిషత్ బాలికోనత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన వీడ్కోలు అలరించాయి. విద్యార్థులు సినీ గేయాలకు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో జి.వి.ఎస్.ఎస్.ప్రసాద్, పి.ఎల్.శకుంతల, ఎ.పి.మురళి, పండ పాల్గొన్నారు.

కొత్తూరు : కోలాటం చేస్తున్న విద్యార్థులు

రణస్థలం రూరల్ : మాట్లాడుతున్న ఎంఇఒ త్రినాథరావు

కోటబొమ్మాళి : విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

బూర్జ : నృత్యం చేస్తున్న విద్యార్థినులు